క్లుప్తంగా

మల్లెలమడుగులో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండలపరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో సోమవారం ప్రత్యేక అధికారి, తహసీల్దార్ స్వర్ణలత ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి జ్యోతి ఆధ్వర్యంలో సోమవారం దోమల మందు ఫాగింగ్ చేశారు. ఈ నెల 9న 'మల్లెలమడుగులో విష జ్వరాలు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి గ్రామంలో దోమలమందు ఫాగింగ్ చేశారు.

నేడు రైతువేదికలో శిక్షణ

ములకలపల్లి: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నేడు(మంగళవారం) రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి కరుణామయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రత వల్ల మామిడిలో పూత, పిందె రాలుట అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, ములకలపల్లి రైతువేదికలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, రైతులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు జమ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ నాల్గోవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆవరణలో ఆ సంఘం అశ్వారావుపేట తాలుకా అధ్యక్షుడు వెంకన్న ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. సైదాచారి, పుల్లయ్య, కృష్ణ, గౌస్, సైదులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

బూర్గంపాడు: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నెలల తరబడి వేతనాలు అందక పోవటంతో పంచాయతీ కార్మికులు పస్తులుంటున్నారని, పంచాయతీ కార్మికులకు శ్రమకు తగిన వేతనాలను సకాలంలో అందించాలని, లేకుంటే వారి పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పోషణ్‌పక్వాడ్ కార్యక్రమం



దంపతులను ఆశీర్వదిస్తున్న సిబ్బంది

ములకలపల్లి: మండలపరిధిలోని పొగళ్లపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్‌పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ జ్యోతి పోషకాహార అవశ్యకతను వివరించారు. పురవీధుల్లో ప్రదర్శన చేశారు. సామూహిక సీమంతాలు చేశారు. ఏసీడీపీఓ సీత, సూపర్‌వైజర్ సామ్రాజ్యం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

భారం కాదు.. భరోసా



హెల్మెట్ వినియోగం తప్పనిసరి

- ఫలితంగా ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం
- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలకు పోలీసుల స్పెషల్ డ్రైవ్



హెల్మెట్ ఉపయోగంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న భద్రాచలం ఏఎస్పీ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఉరుకులు.. పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేకపోవడంతో చాలామంది అక్కడికక్కడే మృతిచెందిన, గాయాలైన సందర్భాలు నిత్యం చూస్తూనే ఉన్నాం. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నప్పటికీ గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ఆత్రుతతో హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు.

చట్టంలో కూడా....

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలని మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారంగా హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించే అవకాశముంది. పదేపదే ఇలాగే వ్యవహరిస్తే డ్రైవింగ్ లెసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేసే అవకాశముంటుంది. కాగా, నాసిరకం హెల్మెట్ పెట్టుకుంటే ప్రమాద తీవ్రతను తగ్గించదని గుర్తించాలి. ప్రధానంగా రవాణా శాఖ, ఐఎస్ఐ అనుమతి పొందిన కంపెనీల హెల్మెట్లే ధరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

వాహనదారుల్లో చైతన్యం కోసం

పోలీసులు భద్రాచలంలో వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తోంది. ప్రదర్శనలు, పలు కూడళ్లలో వాహనదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తోంది. తనిఖీల సమయంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ జరిమానా విధించడమే కాక వివరాలు నమోదు చేస్తారు. రెండు, మూడు సార్లు పట్టుబడితే చర్యలు తీసుకుంటున్నారు. కాగా, భద్రాచలంలో ద్విచక్ర వాహనదారులను చూస్తే 70 శాతం మంది హెల్మెట్ ధరించడం లేదని తెలుస్తోంది. ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేస్తుండటంతో కొందరు హెల్మెట్లు ధరిస్తున్నా మిగతా వారు నిర్లక్ష్యాన్ని వీడడం లేదు.

గత నెలలో జరిగిన ప్రమాదాలు..

భద్రాచలంలోని కొత్త కూరగాయ మార్కెట్ వద్ద ఫిబ్రవరి 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఏపీలోని ఎటపాక మండలం నల్లకుంట్లకు చెందిన తెల్లం భద్రయ్య ద్విచక్ర వాహనంపై వస్తుండగా గల్లీలో నుంచి వస్తున్న ఆటో ఢీ కొట్టగా ఆయన తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. అలాగే, బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర సమీపాన ఈ నెల 15వ తేదీన మోటార్‌సైకిల్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యడమకంటి శ్రీనివాసరెడ్డి అలియాస్ గాంధీ (24) మృతి చెందాడు. ఈ రెండు ఘటనల్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వీరిద్దరు హెల్మెట్ పెట్టుకోలేదని తెలుస్తోంది.



హెల్మెట్ లేకుండా వెళ్తున్న వాహనదారులు

ప్రాణాన్ని కాపాడే రక్షణ కవచం



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని అలవాటుగా మార్చుకోవాలి. ఇది ప్రాణాన్ని కాపాడే రక్షణ కవచం. ఇప్పటికే పట్టణంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇది నిరంతరం కొనసాగిస్తూనే నిర్లక్ష్యం వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– పరితోష్ పంకజ్, ఏఎస్పీ, భద్రాచలం

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి. రిజిస్ట్రేషన్ సమయంలోనే హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధించడంతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తాం. భద్రాచలంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– మధుప్రసాద్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై, భద్రాచలం

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించండి



పినపాక: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పినపాక: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలని సీపీఎం మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న అన్నారు. పార్టీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ ముట్టడి కార్యక్రమంలో భాగంగా సోమవారం పినపాక మండలం ఈ బయ్యారంలోని ఎస్‌బీఐ ఎదుట సీపీఎం, అనుబంధ ప్రజా సంఘాలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించడానికి మరింత సమయం కావాలని ఎస్‌బీఐ చేసిన విజ్ఞప్తి లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు ఇవి బహిరంగపరచబడకుండా చూసేందుకు స్పష్టమైన వ్యూహమని, మోదీ ప్రభుత్వం ఒత్తిడి మేరకు వివరాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ రావు, మడివి రమేష్, దుబ్బా గోవర్ధన్, నట్టి శంకరయ్య, భారీగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలకేంద్రంలోని ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు కొండపల్లి శ్రీధర్, పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, ఆర్ వెంకటాచారి, చల్లపల్లి రాజా, కాంతారావు పాల్గొన్నారు.

ములకలపల్లి: ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను ఎస్‌బీఐ విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, గడ్డం వెంకటేశ్వర్లు, గుగులోతు అనిల్, ముదిగొండ రవి, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండలో..



ములకలపల్లిలో..

సావిత్రిబాయి జీవితం ఆదర్శనీయం



నివాళులర్పిస్తున్న మహిళలు

భద్రాచలంటౌన్: సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమని మహాజన మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత అన్నారు. స్థానిక అశోక్ నగర్ కొత్త కాలనీలో సోమవారం సావిత్రిబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల కుమారి, గద్దల కృష్ణవేణి, ఫాతిమా, సల్మా, సత్యవతి, మంగతాయారు, రాధ, దుర్గా భవాని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదికి నివాళి..



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మణుగూరు రూరల్: న్యాయవాది బొల్లేపల్లి లక్ష్మీనారాయణకు మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణుగూరు మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఏ దశాబ్దాల పాటు న్యాయవాద వృత్తిలో ఉంటూ ఎందరో జూనియర్ న్యాయవాదులకు మెళకువలు నేర్పిన బీష్మ పితామహుడు లక్ష్మీనారాయణ అని కొనియాడారు. మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాస్, న్యాయవాదులు చిర్ర రవికుమార్, కందిమళ్ల నర్సింహారావు, రామ్మోహన్‌రావు, కూర్మా విజయ్‌రావు, పోశం భాస్కర్, నగేష్‌కుమార్, సావిత్రి, కవిత, పద్మావతి, వాసవి, సంధ్య, సర్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చర్ల రూరల్: జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం చర్ల మండలంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు నిర్వహించారు. సోమవారం నుంచి 24 వరకు ఈ సర్వే నిర్వహించనున్నట్లు కొయ్యూరు వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. కుష్ఠు అతి సామాన్యమైన వ్యాధి అని ఎవరికైనా రావొచ్చని ముందుగా గుర్తిస్తే చికిత్స చేయవచ్చన్నారు. వైద్య సిబ్బంది సత్యనారాయణ, వేణు గోపాల కృష్ణ, రాంప్రసాద్, జోగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి

ములకలపల్లి: సబ్‌స్టేషన్ నిర్మాణంతో భూమి కోల్పోతున్న తమకు న్యాయం చేసి, పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు అభ్యర్థించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ వద్ద సోమవారం వారు మాట్లాడుతూ.. మంగలిగుట్ట గ్రామానికి చెందిన కోండ్రు శివాజీ, మల్లేశ్, రాజేశ్ సాగులో ఉన్న తమ ఎకరం భూమిలో సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారన్నారు. బీటీ రోడ్డు నుంచి సబ్‌స్టేషన్‌కు వెళ్లేందుకు దారి నిమిత్తం కూడా తమ పూర్వీకుల అసైన్‌మెంట్ పట్టాలోని జామాయిల్ తోటను కూడా కొంతమేర నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐతే నేటికీ తమకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని తెలిపారు. తమ తల్లిదండ్రులు కూడా చనిపోయారని, శివాజీ అంగవైకల్యంతో బాధపడుతున్నాడని పరిహారం ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు.

రామాలయాన్ని సందర్శించిన మంత్రులు



రామాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు



ఎండోమెంట్ కమిషనర్ అనిల్ కుమార్‌కు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానాన్ని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, డి. శ్రీధర్‌బాబులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వాచనం అందించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలకగా వారు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆలయ అధికారులకు మంత్రుకులు స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు.

రామయ్య సేవలో ఎండోమెంట్ కమిషనర్..

భద్రాద్రి రామయ్యను తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ కమీషనర్ అనిల్ కుమార్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికి ఆలయ సందర్శన అనంతరం స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెలీప్యాడ్ వద్ద ఆంక్షలు..



పట్టణంలో వాహనాల రాకపోకలను నిలిపివేసిన పోలీసులు

భద్రాచలంఅర్బన్/బూర్గంపాడు : సీఎం భద్రాచలం పర్యటన సందర్భంగా సారపాకలోని ఐటీసీ వద్ద హెలిప్యాడ్ ఏర్పాటుచేయగా, పోలీసులు అక్కడ భారీ ఆంక్షలు విధించారు. రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వచ్చిన కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాం నాయక్‌ను లోనికి అనుమతించలేదు. దీంతో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పోలీసులతో వాగ్వాదం చేసుకుంటూ హెలిప్యాడ్ వద్దకు చెరుకోగా, పోలీసుల తీరుపట్ల అసహనం వ్యక్తం చేసిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అక్కడి నుంచి భద్రాచలం వచ్చేశారు. అనంతరం అక్కడున్న మంత్రుల జోక్యంతో బలరాం నాయక్‌ను పోలీసులు హెలిప్యాడ్ వద్దకు అనుమతించారు.

సభకు భారీ బందోబస్తు..

ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో సీఎం, ఇతర మంత్రుల కార్యక్రమం ఉండడంతో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. మల్టీజోన్ –1 రేంజ్ ఐజీ రంగనాథ్ పర్యవేక్షణలో ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, నలుగురు ఏఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 80 మంది ఎస్ఐలతో పాటు మొత్తం 1,000 మంది పోలీసులు విధులు నిర్వహించారు. కాగా, ఇతర వాహనాల నిలిపివేతతో సుమారు 40 నిమిషాల పాటు వాహనదారులు ఎండలో ఇబ్బంది పడాల్సి వచ్చింది.

సీఎంకు వినతుల వెల్లువ..



సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం



వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి వినతులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి..

భద్రాచలంటౌన్: ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి భద్రాచలం వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అభిమన్యు, వీరభద్రం, ముఖ్యమంత్రిని కలిసి గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కారానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏజే రమేష్, బ్రహ్మాచారి ఉన్నారు.

భద్రాద్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలి..

భద్రాచలం పట్టణ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

ఇల్లందును రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలి

కొమరారం, బోడు మండలాలుగా గుర్తించి ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే సీతారామ ప్రాజెక్ట్ నీటిని రోళ్లపాడు రిజర్వాయర్‌లోకి మళ్లించాలని, ఏజెన్సీ ప్రాంతంలో సాగుకు నీరు భూగర్భ గనుల ద్వారా బొగ్గును వెలికి తీయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని వారు ముఖ్యమంత్రిని కోరారు.

వేతనాలు పెంచాలని ...

మణుగూరు రూరల్ : సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని కోరుతూ మణుగూరులో ప్రజాదీవెన సభకు విచ్చేసిన సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి సోమవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూధన్‌రెడ్డి, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ నాయకులు వి జానయ్య, రవి పాల్గొన్నారు.



సీఎంను సన్మానిస్తున్న పొదెం వీరయ్య



గిరిజనేతరులకూ పోడు పట్టాలివ్వాలని బ్యానర్ ప్రదర్శిస్తున్న స్థానికులు

సీఎం సభకు తరలిన జనం



చర్ల: సభకు వెళ్తున్న మహిళలు, నాయకులు



అశ్వారావుపేట నుంచి..

చర్ల: భద్రాచలంలో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు చర్ల మండలం నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో చర్ల మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు వెయ్యి మంది మహిళలు తరలి వెళ్లగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యాకర్తలు ప్రయివేటు వాహానాలలో సుమారు మరో వెయ్యి మంది తరలి వెళ్లారు.

అశ్వారావుపేటరూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలంలో నిర్వహించిన సభకు మండలం నుంచి మహిళలు, కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

ప్రమాదకరంగా 'విస్తరణ'..!

- తవ్వి వదిలేసిన రోడ్డు..
- హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు



విస్తరణ కోసం తవ్విన రహదారి



కల్వర్టు వద్ద ప్రమాదకరంగా ఉన్న ప్రదేశం

అశ్వారావుపేటరూరల్: రహదారి విస్తరణ పనులు కాస్తా ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణాలకు సంబంధించిన పనులు స్థానిక రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షణలో జరగ్గా, ఈ పనులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. అశ్వారావుపేటలోని భద్రాచలం మార్గంలో రహదారి విస్తరణలో భాగంగా స్థానిక దొంతికుంట చెరువు దగ్గర కల్వర్టు నిర్మాణాన్ని సుమారు రెండు నెలల క్రితం చేపట్టారు. ఈ కల్వర్టు నిర్మాణ పనులను పునాది స్థాయి వరకు నిర్మించారు. కాగా ప్రధాన రహదారికి రెండు వైపులా తీసిన పెద్ద గుంతలను మాత్రం పూడ్చి వేయలేదు. కనీసం ఎలాంటి హెచ్చరికా బోర్డులను, రక్షణ చర్యలు కానీ చేపట్టలేదు. ఇదే మార్గంలోని ఓ పెట్రోల్ బంక్ దగ్గర రోడ్డు విస్తరణ కోసం ఒక వైపు దాదాపు ఐదు వందల మీటర్ల మేర రోడ్డును తవ్వి వదిలేశారు. ఇక్కడ కూడా ప్రమాదాలు జరగకుండా హెచ్చరికా బోర్డులు పెట్టలేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో పదుల సంఖ్యలో వాహనదారులు ప్రమాదాల బారిన పడగా, కొంతమంది గాయాలతో బయటపడ్డారు. అయినా సరే అధికారులు, కాంట్రాక్టరులో ఏలాంటి చలనం లేదు.